
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 23 మార్చి 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ - శనివారం
సాయంత్రం - 6.33
సహర్ - ఆదివారం
ఉదయం - 4.55

వైభవంగా పెద్ద రథోత్సవం

» చుక్కాపూర్ కల్కి దోన గుట్టపై
కొనసాగుతున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, మార్చి 22 : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చుక్కాపూర్ గ్రామ సమీపంలోని కల్కిదోన గుట్టపై గల వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున పెద్ద రథోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో అలంకరించి ఉత్సవ విగ్రహాలను ఉంచి.. భక్తులు తాళ్లతో రథాన్ని లాగి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సిద్ధాంతి పట్టాభి రామశర్మ, అర్చకుడు కృష్ణమూర్తి స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రావిచెడ్ వేంకటేశ్వరస్వామి జాతర

కడ్తాల్ : మండల పరిధిలోని రావిచెడ్ గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవాలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయం వద్ద నిర్వాహకులు భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం నిత్య పూజలు, పారాయణం, గీతాలాపన భజలు, అమ్మవార్లకు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనువంశిక ధర్మకర్త పుట్టపాగ రాంచందర్ రావు, ఆలయ నిర్వాహకుడు తిరుమల వింజమూరు రామానుజాచార్యులు, ప్రధాన అర్చకులు ఆచార్య అదిత్య, చిందంబర శర్మ, శిరీష్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రావిచెడ్‌లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఎంపీటీసీ గోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ భారతమ్మ విఠలయ్యగౌడ్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు : పట్టణంలోని వెంకటగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజు శుక్రవారం ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు.



రథాన్ని లాగుతున్న భక్తులు



తడి పొడి లేదు!

ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి వేరు చేసేందుకు గ్రామ పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లను ఏర్పాటు చేశారు. చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును ఉత్పత్తి చేయడమే వీటి ముఖ్య ఉద్దేశ్యం. దాంతో పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరనుంది. అయితే, అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వంతో పారిశుధ్య నిర్వహణ సరిగాలేక ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. దాంతో సెగ్రిగేషన్ షెడ్లు అలంకారప్రాయంగానే మిగిలాయి. జిల్లాలోని 27 మండలాల్లో 558 జీపీల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పాలక వర్గాలు పట్టించుకోకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి.

» అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు
» పంచాయతీల్లో తయారుకాని సేంద్రియ ఎరువు
» సేకరిస్తున్న తడి, పొడి చెత్తంతా వృథా
» నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
» పంచాయతీలకు అదనపు ఆదాయం నిల్

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 22 : గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలతో సేంద్రియ ఎరువును తయారు చేసేందుకు సంకల్పించింది. ఈమేరకు తడి, పొడి చెత్తను వేరుచేసేందుకు సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, స్వచ్ఛభారత్ మిషన్‌ను అనుసంధానం చేసి వీటిని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని 27 మండలాల్లో 558 గ్రామ పంచాయతీల్లో వీటిని నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించి ఒక్కో కేంద్రానికి రూ.2.50 లక్షలు వెచ్చించి గ్రామ శివార్లలో ఏర్పాటు చేశారు. అయితే, సరైన నిర్వహణ లేక ప్రభుత్వ లక్ష్యం నెరవేరని పరిస్థితి నెలకొంది. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన సేంద్రియ ఎరువు తయారీ నీరుగారుతోంది. సేంద్రియ ఎరువు తయారీకి తడి, పొడి చెత్తను వేరే చేసే కేంద్రాల (సెగ్రిగేషన్ షెడ్లు) నిర్మాణాలు పూర్తయ్యేంతవరకు హడావుడి చేసిన అధికార యంత్రాంగం.. అవి పూర్తయిన తర్వాత వాటి నిర్వహణ పూర్తిగా మర్చిపోయారు. సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారు చేయాలని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదు. ఫలితంగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లు వృథాగా ఉంటున్నాయి. ఉన్నతాధికారులు సైతం అటువైపు దృష్టి సారించకపోవడంతో అసలు లక్ష్యం నెరవేరడం లేదు. తడి, పొడిచెత్తను వేరుచేయడం, సేంద్రియ ఎరువు తయారు చేయడం కోసం గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ?

కేంద్రప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద తడి, పొడిచెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువును తయారు చేయాలి. ఆ ఎరువును హరితహారం మొక్కలకు వేయడంతో పాటు, రైతులకు విక్రయించి పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవాలి. కానీ, అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇది కాస్త నీరుగారుతోంది. చెత్త సేకరణ వరకే సక్రమంగా సాగుతుండగా, దానిని వేరుచేసి వ్యర్థాలను ఎరువుగా తయారుచేసే కార్యక్రమాన్ని చేపట్టడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు డంపింగ్‌యార్డులను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

విచ్చలవిడిగా చెత్తను కాల్చేస్తున్న వైనం

ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించి గ్రామ శివారులోని ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. తడి, పొడిచెత్తను వేరు చేయకుండానే కాల్చేస్తున్నారు. ఊరికి దగ్గర సెగ్రిగేషన్ షెడ్లను ఏర్పాటుచేయడంతో.. అక్కడి నుంచి వెలువడే పొగతో చుట్టుపక్కల ప్రాంతాల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. ఈ విషయపై పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

తడి, పొడి చెత్తను వేరుచేయడంలో నిర్లక్ష్యం

నిత్యం ట్రాక్టర్ల ద్వారా తడి, పొడిచెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అయితే, ఎక్కువ శాతం పంచాయతీల్లోని కంపోస్టు షెడ్లలో వ్యర్థాలను వేరు చేసే పనులు జరగడం లేదు. వచ్చినది వచ్చినట్లే కుప్పగా ఒకేచోట పోయడంతో షెడ్లలో వేర్వేరు అవసరాల కోసం నిర్మించిన స్థలాలు ఖాళీగా ఉంటున్నాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో తడి చెత్త నుంచి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేస్తుండగా.. పొడి చెత్తలో లభించే ప్లాస్టిక్, గాజు, ఇనుము, ఇతరత్రా వాటిని వేరు చేయడంలో సిబ్బంది విఫలమవుతున్నారు.

పంచాయతీలకు ఆదాయం సమకూరేనా?

పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చేలా సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను సేకరించిన పారిశుధ్య సిబ్బంది.. సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి అక్కడ వేరు చేయాలి. తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేయాలి. పొడిచెత్తలోని ప్లాస్టిక్, ఇనుము తదితర వస్తువులను వేరు చేసి విక్రయించడం ద్వారా ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వ సూచించింది. అయితే, ఎందుకూ పనికిరాని వస్తువులను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అవసరమైన వ్యర్థాలతో పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేటట్లు చూడాలి. సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ సరిగాలేక కేవలం చెత్త సేకరణకే పరిమితమవ్వడంతో లాభం లేదు. సేంద్రియ ఎరువులు తయారు చేస్తేనే పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూరనుంది.



దామరగిద్దలో నిరుపయోగంగా ఉన్న సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం

‘పట్నం’లో పన్నుల వసూళ్లు వేగవంతం

» ఇప్పటి వరకు రూ.4.30 కోట్లు వసూలు



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : 2023-24 ఆర్థిక సంవత్సరం మార్చి నెలా ఖరుతో ముగియనుండగా.. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లను వేగవంతం చేశారు. మొత్తం డిమాండ్ రూ.10.63 కోట్లు కాగా, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతరత్రా రూ.3.93 కోట్లు పోను.. రూ.6.70 కోట్లు వసూలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు రూ.4.30 కోట్లు వసూలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రవీందర్ సాగర్ తెలిపారు. కొంత కాలంగా బకాయిలు పేరుకుపోయిన వ్యాపార సముదాయాలను సీజ్ చేశారు. బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు మొత్తం 20 మంది పన్నుల వసూళ్లలో నిమగ్నమయ్యారని, ఈ నెలాఖరులోపు పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలని నిర్ణయించినట్లు కమిషనర్ తెలిపారు.

ఏప్రిల్ 4న ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం

» ఉత్తర్వులు జారీచేసిన కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం, మార్చి 22: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై అవిశ్వాస ఓటింగ్ కోసం ఏప్రిల్ 4వ తేదీని ఖరారు చేస్తూ కలెక్టర్ శశాంక ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి అవిశ్వాసం ప్రకటించిన కౌన్సిలర్లకు శుక్రవారం నోటీసులు అందజేశారు. కాగా, మున్సిపాలిటీలో మొత్తం 24 మంది సభ్యులుండగా.. వైస్ చైర్మన్ యాదగిరి బీఆర్ఎస్ పార్టీకి చెందినప్పటికీ అధికార కాంగ్రెస్‌కు చెందిన 10 మందికితోడు ఆరుగురు బీఆర్ఎస్ సభ్యులు కలిసి 16 మంది అవిశ్వాసాన్ని ప్రకటించారు. 20 రోజులుగా వీరు ఇతర రాష్ట్రాల్లో క్యాంపులో ఉన్నారు. కాగా, ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి ప్రిసైడింగ్ అధికారిగా ఓటింగ్ చేపట్టనున్నారు.

నాలుగెకరాల అసైన్డ్ భూమి స్వాధీనం



భూమిలో బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

చేవెళ్ల, మార్చి 22 : నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసిన ప్రభుత్వ అసైన్డ్ భూమిని రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని కనకమామిడి గ్రామానికి చెందిన తొంట అంత య్య, నారాయణ, జంగయ్య, యాదమ్మకు ప్రభుత్వం గతంలో సర్వేనెంబర్ 54లో 4 ఎకరాల భూమిని అసైన్ చేసింది. ఈ భూమిని నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు కొనుగోలు చేశారు. అయితే, రిజిస్ట్రేషన్ పత్రాలు పరిశీలించిన అధికారులు కొనుగోలు చేసిన వ్యక్తులకు నోటీసులు ఇచ్చారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ఆదేశానుసారం ఆర్ఐ చంద్రమౌళి రెవెన్యూ సిబ్బందితో వెళ్లి భూమిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భూమి ప్రభుత్వానికి చెందినదిగా బోర్డును ఏర్పాటు చేశారు. కాగా, ప్రభుత్వ అసైన్డ్ భూములు అమ్మడం, కొనడం చట్టవిరుద్ధమని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది భాస్కర్, మహేందర్ తదితరులున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

» సర్వేనెంబర్ 171లోని స్థలంపై విచారణ జరపాలి
» మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



భూముల హద్దులను పరిశీలిస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్, మార్చి 22 : షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తెలిపారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉందన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. షాద్‌నగర్ పట్టణ శివారులోని పాత ఆశియానా హోటల్ సమీపంలో గల సర్వేనెంబర్ 171లోని 5.8 గుంటల స్థలంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వేనెంబర్‌లో ఎకరం భూమి విలేకరులకు, 3 ఎకరాలు రామలింగేశ్వర గొర్రెల పెంపకం కేంద్రానికి, ఎకరం స్థలాన్ని ఇతరులకు పంపకాలు చేపట్టినట్లు ఉందని తెలిపారు. అయితే, ఈ భూమికి సంబంధించిన పంపకాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నందున పూర్తి విచారణ జరిపి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. అంతకుముందు ఆయన ప్రభుత్వ భూముల హద్దులను పరిశీలించారు.

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు



జాతీయ రహదారిపై ప్రమాద స్థలాలను పరిశీలిస్తున్న ఎన్‌హెచ్ఏఐ అధికారులు

ఇబ్రహీంపట్నం, మార్చి 22: హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పోలీసులతో కలిసి పరిశీలించారు. మండల కేంద్రంలోని హైటెక్ దాబా, నేదునూరు క్రాస్ రోడ్డు సమీపంలోని పలు ప్రాంతాలను ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలుగా గుర్తించినట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో తగిన చర్యలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ సైట్ ఇంజనీర్ హర్షిణి, బ్రిడ్జ్ ఇంజనీర్ శ్రీనివాస్, రోడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ కీసర నాగరాజు, కందుకూరు సీఐ మక్బూల్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

● మరమ్మతులకు నోచుకోని రోడ్లు ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



మురుగు చేరడంతో గుంతలమయంగా మారిన చిత్తాపూర్-తిప్పాయిగూడ రోడ్డు

మంచాల, మార్చి 22 : మండల పరిధిలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. చిత్తాపూర్-తిప్పాయిగూడ రహదారి రోడ్డుపై ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్డుపైకి చేరుకోవడంతో గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రి సమయాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాంద్‌ఖాన్‌గూడ-ఆరుట్ల రహదారిపై ఏర్పడిన గుంతల వల్ల వాహనాలు ఒక పక్కకు ఒరిగి వెళ్లే పరిస్థితి దాపురించింది. ఈ రహదారి మరమ్మతుల కోసం కాంట్రాక్టర్ కంకర వేసి ఎనిమిది నెలలుగా గడుస్తున్నా.. బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదు. అదేవిధంగా మంచాల-జాపాల రహదారిపై బీటీ తేలింది. కాగా, రీబీటీ వేసి ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. అస్మత్‌పూర్-మంచాల రోడ్డుపై కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి వెంట అస్మత్‌పూర్‌కు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళ ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. కొత్త ప్రభుత్వం మండలంలోని రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని మరమ్మతులు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



గోతులమయంగా మారిన చాంద్‌ఖాన్‌గూడ-ఆరుట్ల రోడ్డు

ప్రమాదకరంగా రహదారులు



రహదారులపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా తిప్పాయిగూడ-చిత్తాపూర్ రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రాత్రివేళ ఈ రహదారిపై వెళ్లాలంటేనే భయమేస్తోంది. చిత్తాపూర్ వద్ద మురుగు రోడ్డుపైకి చేరడంతో గుంతలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

- ప్రశాంత్‌కుమార్, తిప్పాయిగూడ

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



రోడ్లన్నీ గోతులమయంగా తయారయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు మారినా రోడ్ల దుస్థితి అలాగే ఉంది. నిధులు విడుదల చేసి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటాం. గుంతల రోడ్లపై ప్రయాణించాలంటేనే భయమేస్తోంది.

- చిల్లాపురం మధు, తిప్పాయిగూడ



నక్కలపల్లి- కేతిరెడ్డిపల్లి గ్రామాల మధ్య రోడ్డుపై ఏర్పడిన గుంత

గుంతలమయంగా చేవెళ్ల-శంషాబాద్ రోడ్డు

» వాహనదారుల ఇబ్బందులు.. పట్టని అధికారులు

చేవెళ్ల, మార్చి 22 : చేవెళ్ల నుంచి శంషాబాద్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రహదారిపై వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు చేవెళ్ల నుంచి కందవాడ, నక్కలపల్లి, వెంకటాపూర్ గ్రామాల మీదుగా శంషాబాద్‌కు వెళుతుంది. చేవెళ్ల మండలంలోని పలుగుట్ట, కందవాడ, నారాయణదాస్‌గూడతో పాటు మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి, తోలుకట్ట, ఎత్‌బార్‌పల్లి తదితర గ్రామాల ప్రజలు ప్రయాణం సాగిస్తుంటారు. అదేవిధంగా శంషాబాద్ విమానాశ్రయం వెళ్లే వారితో పాటు శంషాబాద్ మార్కెట్‌కు కూరగాయలు తీసుకెళ్లేందుకు రైతులు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. కాగా, ఈ రహదారిని పదేళ్ల క్రితం వేశారు. ప్రస్తుతం రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నక్కలపల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతన్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇంతకుముందు చేవెళ్ల నుంచి శంషాబాద్ వరకు ఆర్టీసీ బస్సు నడిచేది. రోడ్డు గుంతలమయంగా మారడంతో బస్సు సర్వీసును నిలిపి చేశారు.

రోడ్డును బాగు చేయాలి



చేవెళ్ల నుంచి శంషాబాద్ వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దాంతో వాహనదారులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి. ఈ రహదారిపై నిత్యం రాకపోకలు సాగించాలంటే ఇబ్బంది పడుతున్నాం.

- ఆర్.అర్చన, ఎంపీటీసీ, కేతిరెడ్డిపల్లి

పూడూరులో పోలీసు కవాతు



పూడూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పూడూరు, మార్చి 22: మండల కేంద్రంలో పోలీసు కవాతు నిర్వహించారు. పోలీసులు పూడూరులోని పురవీధుల గుండా శుక్రవారం కవాతు నిర్వహించి అవగాహన కల్పించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసమే ఈకవాతు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి సీఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.


ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : తుక్కుగూడ మున్సిపాలిటీలోని శ్రీనగర్ లోగల శ్రీ ఆదిలక్ష్మి అలివేలుమంగ సమేత శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలు మూడు రోజుల పాటు వైభవంగా జరుగనున్నాయి. గురువారం రాత్రి మంకాల్ గ్రామం నుంచి శ్రీనగర్ దేవునిగుట్టవద్దకు అశేష భక్త జనం మధ్య మాజీ హోంమంత్రి టి. దేవేందర్‌గౌడ్ కుటుంబసభ్యులు పల్లకిపై స్వామివారి ఉత్సవ విగ్ర హాలను గుట్టపైకి తీసుకువచ్చారు. ఉత్సవాల్లో భాగంగా అలయ వంశపారంపర్య ధర్మకర్తలు శేషం జగన్నాథాచార్యులు, సింహాచార్యులు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మాజీ హోంమంత్రి టి. దేవేందర్‌గౌడ్, విజయేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్,మధుమోహన్‌గుప్త పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి


దోమల మందు పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది

మర్పల్లి, మార్చి 22: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని హెల్త్ సూపర్‌వైజర్ అమరేశ్వరి అన్నారు. డెంగ్యూతో బాలుడు మృతి చెందిన ఘటనతో వైద్యాధికారులు స్పందించారు. మండలంలోని రావుల్‌పల్లి గ్రామంలో శుక్రవారం భుజంగం ఇంటి దగ్గర పంచాయతీ, వైద్య సిబ్బంది బాలుడి మృతి సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటి పరిసర ప్రాంతాల్లో దోమల మందును పిచికారిచేసి పారిశుధ్య పనులు చేపట్టారు. వైద్యాధికారులు గ్రామస్థులతో మాట్లాడుతూ వర్షాకాలం, శీతాకాలం అనే తేడా లేకుండా పారిశుధ్యం పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి చుట్టు పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమల బెడద అధికంగా ఉంటే పంచాయతీ సిబ్బందికి, ఏఎన్‌ఎంలకు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు, మార్చి 22: భారత ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. తాండూరులోని మర్వాడీ సంఘాల సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం ధర్మం కోసం బీజేపీకి ఓటేయాలని పిలుపునిచ్చారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రధాని మోదీకి మద్దతుగా అందరం కలిసి కట్టుగా పార్లమెంటు ఎన్నికల్లో సత్తాచాటాలన్నారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పేద, బడుగువర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. చేవెళ్ల పార్లమెంటు స్థానంలో అత్యధిక మెజార్టీతో బీజేపీ విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వచ్చే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు వేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సాయం లేనిది తెలంగాణలో అభివృద్ధి జరిగే అవకాశం లేదన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తీసుకొచ్చి చేవెళ్లను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కులమతాలకతీతంగా యావత్ భారతదేశాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రధాని మోడీ ముందుకెళ్తున్నట్లు గుర్తు చేశారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అనేక నిధులను మంజూరు చేసిందన్నారు. 2014 ముందు దేశంలో అవినితి మాత్రమే ఉండేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకును చీల్చడం ఎవరితరం కాదని, పార్లమెంట్ ఎన్నికల్లో పక్కాగా బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బాలేశ్వర్ గుప్తా, భద్రేశ్వర్, శ్రీలత, ఉప్పరి రమేష్, మార్వాడి సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో పంచాయతీలు



అన్నారం గ్రామ పంచాయతీ

కొడంగల్ రూరల్, మార్చి 22: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులకు చెక్ పవర్ కల్పించలేదు. గతంలో సర్పంచ్‌లు సొంత డబ్బులు ఖర్చులు చేసి ఆ తర్వాత బిల్లులు పెట్టుకునేవారు. ఇప్పుడు ప్రత్యేక అధికారులు తమ సొంత డబ్బులు ఖర్చు చేయడానికి ముందుకు రాకపోవడంతో సమస్యలు ఎక్కడికక్కడ ఉంటున్నాయి. నిధులు డ్రా చేసే అవకాశం లేకపోవడంతో పంచాయతీలు ఆర్థికంగా సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చినప్పటికీ చెక్‌పవర్, డిజిటల్ కీ ఇవ్వడంలో జాప్యం జరుగుతుంది. ఒక్కో గెజిటెడ్ అధికారికి రెండు, మూడు గ్రామాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించడంతో బ్యాంకులో అడ్డంకీగా మారుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో కొడంగల్ మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో పాలన పట్టు తప్పుతుంది.

పాలనకు ఆటంకం

ప్రతీ నెల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద పీఎఫ్‌ఎంఎస్, ఎస్‌ఎఫ్‌సీ, జనరల్ ఫండ్ నిధులను మంజూర్ చేస్తుండగా వాటిని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు వారికి ఉన్న చెక్ పవర్ ద్వారా అవసరాల మేరకు నిధులను వినియోగించుకునేవారు. ప్రస్తుతం ఆ అధికారాలను ప్రత్యేకాధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వాహణ, తాగునీటి పైపులైన్ మరమ్మతులు, వీధి దీపాల నిర్వాహణకు చెల్లింపులు చేయలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులు, పంచాయతీ కార్యదర్శులకు వేతనాలు, ట్రాక్టర్ కిస్తులు చెల్లించడం ఇబ్బందికరంగా మారిందని, అధికారులు స్పందించి వెంటనే చెక్ పవర్ వచ్చేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.


శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న కల్వ సుజాత

వైశ్య కార్పొరేషన్‌కు రూ.1000కోట్లు కేటాయించాలి

తాండూరు, మార్చి 22: వైశ్య కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత ప్రభుత్వాన్ని కోరారు. తాండూరు పట్టణం ఆర్యవైశ్య సంఘంలో సంఘం ప్రతినిధులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. పదేళ్ల పోరాటం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలో వైశ్య కార్పొరేషన్ ఏర్పాటైందని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో వైశ్య కార్పొరేషన్‌ను తానే చేర్పించానని తెలిపారు. ఈ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని సీఎం కేసీఆర్‌ను కోరినట్లు చెప్పారు. దీని ద్వారా చిన్నచిన్న వ్యాపారులకు రుణ సౌకర్యం, పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రుణం ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వైశ్య కార్పొరేషన్‌కు సంబంధించి విధివిధానాలు ఇంకా ఖరారు కాగానే మొదటగా తాండూరు నుంచి పేద వైశ్యులకు సాయం అందిస్తామని తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి, యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కటికం వీరేందర్, ప్రధాన కార్యదర్శి కోట మురళీకృష్ణ, నగరేశ్వర దేవస్థాన చైర్మన్ కుంచం మురళీధర్ పాల్గొన్నారు.

మహేశ్వరంలో బీఆర్‌ఎస్ ఖాళీ


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేసి కాంగ్రెస్‌దే పై చేయిగా నిలపాలని రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా చేవెళ్ల ఎంపీ సీటు కాంగ్రెస్‌దేనని ఆమె చెప్పారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని సర్దార్‌నగర్‌లో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంతో పాటు ఆ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో అనితారెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరవేయడంలో కార్యకర్తలు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. మహిళా లోకమంతా హస్తం వైపే ఉన్నారని, బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు అభయహస్తం వంటి పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారైనప్పటికీ రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. కార్యకర్తలకు ఎలాంటి అవసరం ఉన్నా సమన్వయంతో కలిసి కట్టుగా పరిష్కరించుకుని ముందుకు సాగుదామన్నారు. కష్టపడే కార్యకర్తలకు కాంగ్రెస్ అన్యాయం చేయదని, నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తేవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కెఎల్‌ఆర్, ఏనుగు జంగారెడ్డి, జి. జానకీరామ్, సమత తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో వాసుచంద్ర

భూకబ్జా వివాదం.. ఆర్డీవో పరిశీలన

దోమ, మార్చి 22: మండలంలోని తిమ్మాయిపల్లిలో గల సర్వేనెంబరు 50లో కబ్జా విషయంలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు శుక్రవారం వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర పరిశీలించారు. గ్రామానికి చెందిన రాములమ్మకు ఎకరా తొమ్మిది గుంటల భూమి ఉంది. అట్టి భూమిని 2018 సంవత్సరంలో అయూబ్ అనే వ్యక్తికి విక్రయించింది. ఓ భూమి చూపి మరొక భూమి పట్టాచేసి ఇచ్చినట్లు కొన్ని సంవత్సరాలుగా ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. భూసమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని లేదా కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప దాడులకు పాల్పడటం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఆర్ఐ సుదర్శన్, రైతులు పాల్గొన్నారు.

రేపు బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమావేశం

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : రేపు (ఆదివారం) నిర్వహించబోయే బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి మండలం నుంచి అన్ని గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీగా తరలి విజయవంతం చేయాలని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లెలగూడలోని సామ యాదిరెడ్డి గార్డెన్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ కాకి రాములు, డైరక్టర్లు పొట్టి ఆనంద్, సామ ప్రకాశ్‌రెడ్డి, ఎస్ శేఖర్‌రెడ్డి, నాయకులు తాండ్ర దేవేందర్, పర్వతాలుయాదవ్, సామయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జంగారెడ్డి, సురేందర్‌రెడ్డి


రేగడిచిల్కమర్రిలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

గ్రామాభివృద్ధికి సహకరిస్తా

» కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

కొందుర్గు, మార్చి 22: రేగడి చిల్కమర్రి గ్రామాభివృద్ధికి సహకరిస్తానని కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆ గ్రామానికి చెందిన చెరుకుపల్లి సురేష్ గ్రామస్థుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ రేగడి చిల్కమర్రి తన సొంత ఊరు షేర్ అప్పారెడ్డిపల్లి లాంటిదని, తనకు ఈ గ్రామంతో ప్రత్యేక అనుబంధం ఉందని చెప్పారు. వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, వీరేందర్‌రెడ్డి, శ్రీరామ్, చిన్నఎల్కిచర్ల మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఖలీంకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.


కులకచర్ల చౌరస్తాలో రోడ్డుపై నిలిపిన వాహనాలు

రోడ్డుపైనే పార్కింగ్.. తరచూ ప్రమాదాలు

కులకచర్ల, మార్చి 22: మండల కేంద్రంలోని చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడంతో తరచూ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వాహనాలు, తోపుడు బండ్లు రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. చౌరస్తా నుంచి నాలుగుదారులు పరిగి, నంచర్ల, పాంబండ, కులకచర్ల దారిలో ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, జీపులు, డీసీఎంలు, బైక్‌లు అడ్డగోలుగా పార్క్ చేస్తున్నారు. తోపుడు బండ్లు, కూరగాయల దుకాణాలు రోడ్డుపై ఏర్పాటు చేశారు. దీంతో బస్సులు, లారీలు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యతో గురువారం లారీ బైక్‌ను ఢీకొట్టి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ సిబ్బంది

» అనుమతి లేని బస్సులపై కేసు

చేవెళ్ల, మార్చి 22 : నిబంధనలు పాటించని బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ కిరణ్ హెచ్చరించారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో గురువారం ఎంవీఐ సిబ్బంది పాఠశాలల బస్సులను తనిఖీ చేసి సరైన అనుమతులు లేకుండా నడుస్తున్న నాలుగు బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ పాఠశాలల బస్సులు నడిపే డ్రైవర్లు తప్పకుండా అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. పర్మిషన్‌తో పాటు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తదితర సర్టిఫికెట్లు తీసుకొని బస్సులు నడుపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సిబ్బంది పాల్గొన్నారు.

సౌరశక్తితో నూతన ఆవిష్కరణలు చేపట్టాలి



ప్రొఫెసర్ కృష్ణవేద్‌ను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ నల్ల దివ్య

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 22: విద్యార్థులు సౌరశక్తిని వినియోగించుకుని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని అమెరికా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణవేదులు అన్నారు. మండలంలోని కాచవానిసింగారం, దివ్యానగర్‌లోని నల్లమల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 'సస్టైనబిలిటీ క్లైమేట్ చేంజ్' అనే అంశంపై జరిగిన జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులు నిత్యం పరిశోధనలపై దృష్టిసారించాలని సూచించారు. సౌరశక్తిని వినియోగించుకొని రివర్స్ ఆస్మాసిస్‌లో వర్షపునీటిని తాగునీటిగా మార్చడం, రోబో రూపకల్పన, సౌరశక్తితో చీకటిపడగానే వీధిదీపాలు వెలగడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్లాంటేషన్, ప్లాస్టిక్ వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తికి రూపకల్పన చేయాలన్నారు. జాతీయస్థాయి సదస్సులతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత బయటపడుతుందన్నారు. పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి నల్ల దివ్య, ప్రిన్సిపాల్ ఎంఎస్‌వీ రమేష్, ఆయా విభాగాల డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్కాజిగిరికే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు

మంజూరు చేయిస్తానని మంత్రి తుమ్మల హామీ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తిరుమలగిరి మార్చి 22 : మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో సీఎం కోట కింద ఇందిరమ్మ ఇళ్లను అత్యధికంగా మంజూరు చేయిస్తానని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీనిచ్చారు. తిరుమలగిరిలోని జయలక్ష్మీ గార్డెన్‌లో శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గం కావడంతో తిరిగి ఈ పార్లమెంట్ సీటు నుంచి పోటీ చేస్తున్న పట్నం సునీతరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యమయ్యాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ తిరిగి గాడిలో పెడుతామని తెలిపారు. కేంద్రంలో రాబోయేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీని ఓడించిన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలదే ప్రత్యేక పాత్ర ఉందన్నారు. దేశంలోనే అతిపెద్దది మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గమని, ఈ ప్రభుత్వం సుభిక్షంగా పాలన కొనసాగాలంటే మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. గడిల పాలనను బద్దలు కొట్టి ఇందిరమ్మ పాలనను తీసుకొచ్చామన్నారు. హైదరాబాద్‌కు కావాల్సిన వనరులు సాధించుకున్నామని, కంటోన్మెంట్ స్కైవేలను ఏర్పాటు చేయడానికి రక్షణ శాఖ ద్వారా అనుమతి పొందడం సీఎం రేవంత్‌రెడ్డి ఘనతగా చెప్పుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, వెన్నెల, శ్రీగణేష్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు పాల్గొన్నారు. అయితే బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రంగా రవీందర్‌గుప్తాను కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నీటి సంరక్షణ బాధ్యత అందరిది

- నీటిని పొదుపుగా వాడుకోవాలి
- ప్రపంచ నీటి దినోత్సవంలో వక్తలు



పర్వేద గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చేవెళ్ల, మార్చి 22 : నీటిని సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. కాంచన లత అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీరు జీవనాధారం అని అన్నారు. దేశంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు రైతాంగానికి నష్టాలను మిగిల్చాయనని, పంటలకు నీరందక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని వాపోయారు. ప్రసుత్తం బెంగుళూర్‌లో నీటి కొరత ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్రతి నీటిబొట్టును జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. జ్యోతి, అధ్యాపకులు శకుంతల, రాగిణి, వెంకట్‌లక్ష్మి, వీరేశం, విద్యార్థులు ఉన్నారు.

శంకర్‌పల్లి మండల పరిధిలోని పర్వేద గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బాలవికాస సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దేశ్వర్ మాట్లాడుతూ భావితరాల కోసం నీటిని ఆదా చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, శ్రీధర్‌రెడ్డి, రాజు, రాజేందర్, కాంచనలక్ష్మి, కవిత, విద్యార్థులు ఉన్నారు.

ఆదిభట్ల : భూగర్భజలాలను పెంచుకోవడానికి ప్రతి ఇంట్లో విధిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలని ఆదిభట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ వరకాల ప్రభాకర్ అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నీటి సంరక్షణపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీరు లేకుండా ప్రపంచం మనుగడ సాగించలేదని చెప్పారు. బావితరాలకు నీటిని సమృద్ధిగా అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత


ఎఫ్టీఎల్‌లో నిర్మాణాలను కూల్చేస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అనుమతి లేని నిర్మాణాలపై శుక్రవారం అధికారులు కొరడా ఝుళిపించారు. సర్వే నెం. 1137, 1250లో పలువురు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అనుమతి లేకుండా ప్రహరీ నిర్మాణాలు చేస్తున్నారు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పుష్పలత, ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి తమ బృందంతో వెళ్లి జేసీబీతో ఆ నిర్మాణాలను కూల్చివేశారు. నిర్మాణాలు చేపడుతున్న సురేష్ పటేల్, నాంజీపటేల్‌పై కేసులు నమోదు చేసినట్లు ఆర్ఐ పుష్పలత తెలిపారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు


సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఆమనగల్లు , మార్చి 22 : సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లుకు చెందిన గుర్రం కరుణ శ్రీకేశవులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో నెలకొన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సీఎం సూచించినట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

షాబాద్ : టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సీఎం సూచించారని మధుసూదన్‌రెడ్డి చెప్పారు.

108ను తనిఖీ చేసిన మేనేజర్

యాచారం, మార్చి 22 : యాచారం మండల కేంద్రంలో 108 అంబులెన్స్ తీరును జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకాంత్, ఈఎంఈ రాజబాబు, ఆడిటర్ ఫయాజ్ తదితరులు తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఇంజక్షన్లు అందుబాటులో ఉండాలని వాటి కొరత లేకుండ చూసుకోవాలని పరికరాలను నిత్యం పరిశీలించుకోవాలని వారు అంబులెన్స్ సిబ్బందికి సూచించారు. సమాచారమందగానే సంఘటనా ప్రదేశానికి సకాలంలో వెళ్లి బాధితులను ఆదుకోవాలని వారు చెప్పారు. ప్రజలు 108పై ఎంతో నమ్మకంతో ఫోన్ చేస్తారని వారికి సాయమందించేలా ఉండాలని వారు అంబులెన్స్ డ్రైవర్లు, ఈఎంటీలకు సూచించారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకటేష్ మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు దేశం కోసం ప్రాణాలర్పించారని, యువతకు వారు స్ఫూర్తిదాయకమని అన్నారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు పి.జగన్, బి.శంకర్, జంగయ్య, రాఘవేందర్, ఉన్నారు.

బొడ్రాయి ఉత్సవాలకు ఆహ్వానం

షాబాద్, మార్చి 22 : మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఏప్రిల్ 3 నుంచి నిర్వహించే బొడ్రాయి, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డిని నిర్వాహకులు ఆహ్వానించారు. శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో కలిసిన రుద్రారం గ్రామస్థులు, ఉత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం ఉత్సవాలకు తనవంతు సహాయంగా అవినాష్‌రెడ్డి రూ. లక్ష విరాళం గ్రామస్థులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు బండ సతీష్, బండ నర్సింహులు, విష్ణువర్దన్‌రెడ్డి, కృష్ణ తదితరులు ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్, మార్చి 22 : కేశంపేట మండల కేంద్రంలోని అమృత లింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య ఊరేగింపుగా నిర్వాహకులు ఆలయానికి తీసుకవచ్చారు. ఆలయ పూజరుల మంత్రోచ్చరణల మధ్య గ్రామానికి చెందిన మఠం శేఖర్ - చందన దంపతులు స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. కల్యాణాన్ని తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు మఠంవారు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సజ్జల విశ్వానాథం, శశిధర్, కుమారస్వామి, సిద్దేశ్వర్, చిన్నయ్యస్వామి, సురేందర్ రెడ్డి, దశరథం, పాండుగౌడ్, రమేష్ప, మహేష్ కుమార్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం


ఆమనగల్లు : మాట్లాడుతున్న రాములు

ఆమనగల్లు , మార్చి 22: బీజేపీతోనే దేశంలో అవినీతి రహిత, సుస్థిర పాలన సాధ్యమని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీగార్డెన్‌లో శుక్రవారం బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి వారు, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ 12 స్థానాలు కైవసం చేసుకొని ప్రత్యామ్నాయ శక్తిగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్రంలో హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. బీజేపీ నాగర్‌కర్నూల్ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పురుషోత్తంరెడ్డి, మన్యనాయక్, కండె హరిప్రసాద్, నియోజకవర్గ కన్వీనర్ యెన్నం శేఖర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, గోరటి నర్సింహ, కండె హరిప్రసాద్, కాసుల వెంకటేశ్, రాంపాల్‌నాయక్, పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ సందర్శన

కడ్తాల్ : మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని శుక్రవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్, ఎంపీ పోతుగంటి రాములు సందర్శించారు. మైసమ్మ దేవతమకు వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్ నాయక్, రెడ్యనాయక్, మహేశ్, సాయిలాల్ నాయక్, శంకర్, రవీందర్‌రెడ్డి, యాదగిరి, పాల్గొన్నారు.

ఫీజుల కోసం వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : ఫీజుల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వేధిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నగర కార్యదర్శి దర్వల్లి మహేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని ప్రియాంక స్కూల్ ముందు ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ పాఠశాల యాజమాన్యం ఫీజులు చెల్లించని విద్యార్థులను తరగతులకు అనుమతించడం లేదని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు ఆ పాఠశాల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, పవన్, అదర్శ, చరణ్, అనిల్ తదితరులున్నారు.

నారాయణ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

చేవెళ్ల : శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం యాప్ పేరుతో అదనంగా రూ.రెండువేలు తల్లిదండ్రుల నుంచి వసూళ్లకు పాల్పడుతోందని శంకర్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనికి చెందిన లక్ష్మణ్ అనే వ్యక్తి శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థ శంకర్‌పల్లి బ్రాంచి ప్రిన్సిపాల్ విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గుర్తింపులేని పాఠశాలల్లో పిల్లలను చేర్పొద్దు

యాచారం : ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పొద్దని, గుర్తింపు లేకుండా మండలంలో ఏ పాఠశాలను నడపరాదని ఇన్‌చార్జ్ ఎంఈవో వెంకటరెడ్డి శుక్రవారం యాచారంలో విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని చైతన్య పాఠశాలకు విద్యాశాఖ పరంగా ఎలాంటి అనుమతులు లేవని చెప్పారు. అనుమతి లేకుండా పాఠశాలలను నడిపి విద్యార్థుల జీవితాలను ఇబ్బందులకు గురి చేయొద్దని ఆయన అన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మహిళలను సన్మానిస్తున్న అధికారులు

కొత్తూర్, మార్చి 22 : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకపక్షం, మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలను ఘనంగా సన్మానించారు. సమతుల ఆహారం, చిరు ధాన్యాల వినియోగంపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి, వివిధ గ్రామాల గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ ఉపాధాయయులు పాల్గొన్నారు

కడ్తాల్ : పోషక విలువలు కలిగిన చిరు దాన్యాలు, ఆకు కూరలను ఎక్కువగా తీసుకోవాలని ఆమనగల్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ సూచించారు. కడ్తాల మండలం వాస్‌దేవ్‌పూర్ గ్రామంలో శుక్రవారం ఐడీఎస్ ఆధ్వర్యంలో పోషక పక్షోత్సవాన్ని నిర్వహించారు.

విద్యార్థులు సోదర భావంతో మెలగాలి


ముగ్గులు వేస్తున్న అధ్యాపకులు, తదితరులు

మంచాల, మార్చి 22 : విద్యార్థులు సోదరభావంతో మెలిగి, ఐకమత్యాన్ని చాటాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ జి.నాగయ్య సూచించారు. ఇబ్రహీంపట్నం వినోబానగర్‌లోని ఆ కళాశాలలో శుక్రవారం ట్రెడిషనల్ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులు ధరించి ర్యాంప్‌వాక్ చేసి అలరించారు. ఇంకా వివిధ పండుగల ప్రాముఖ్యతను గుర్తుచేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ ఎక్కడున్నా మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు మనం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డా.ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ డా.శేఖర్ బాబు, డీన్ డా.కృష్ణమోహన్, కృష్ణారెడ్డి, టెక్‌వనం కన్వీనర్లు వెంకటేశం, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మారుతున్న కాలానికనుగుణంగా బోధన



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

చేవెళ్ల, మార్చి 22 : మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన తీరు మార్చుకుంటే మంచిదని జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రావు చెప్పారు. శుక్రవారం శంషాబాద్ మండలంలోని పాల్మాకుల గ్రామంలోని మోడల్ పాఠశాలలో జరిగిన సైన్స్‌ఫేర్‌లో పాల్గొని విద్యార్థులు చేసిన పలు ప్రయోగాలను పరిశీలించారు. ఆటోమేటిక్‌గా వీధిదీపాలు వెలిగించే విధానంపై చేసిన ప్రయోగాన్ని చూసి విద్యార్థులను అభినందించారు. ప్రయోగాలు చేసిన విద్యార్థులకు ఆయన ప్రశంస పత్రాలందించారు. సోలార్ రోటర్ తదితర ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం విష్ణుప్రియ, పాల్మాకుల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అతీక్ తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డలో కాంగ్రెస్ నేతల సంబరాలు


స్వీట్లు పంచుతున్న నాయకులు

ఆమనగల్లు, మార్చి 22 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా మల్లు రవి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడాన్ని హర్షిస్తూ ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో శుక్రవారం పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలకు మిఠాయిలు పంచారు. బాణా సంచా పేల్చి కాంగ్రెస్ , మల్లు రవి కి అనుకూలంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మల్లు రవి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని రవీందర్ నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేశ్ నాయక్, పాండు నాయక్, రాజ్‌కుమార్, వసంత్, లౌక్య, మస్రు, పికిలి, నీల, సన్ని, మల్య, దస్రు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గోడలకు మ్యూరల్ ఆర్ట్

షాబాద్, మార్చి 22 : వెల్స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని సీతారాంపూర్ ప్రభుత్వ పాఠశాల గోడలకు మ్యూరల్ ఆర్ట్ ద్వారా శుక్రవారం విద్యార్థులను ఆకర్షించే విధంగా రంగు రంగుల బొమ్మలను వేశారు. ఉయ్ వాలంటీర్ అనే కార్యక్రమంలో భాగంగా 60 మంది వెల్స్పన్ ఫ్లోరింగ్, టెక్స్‌టైల్స్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్త పాండురంగారెడ్డి, వెల్స్పన్ సిబ్బంది రీతంరే, సురేఖ, భద్రయ్య, పాఠశాల హెచ్‌ఎం విజయశ్రీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమతి లేకుండా మద్యం అమ్మితే కేసులు

చేవెళ్ల, మార్చి 22 : గ్రామాల్లో అనుమతి లేకుండా మద్యం అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల ఎస్సై ప్రదీప్‌కుమార్ హెచ్చరించారు. చేవెళ్ల మండల పరిధిలోని అల్లావాడ గ్రామంలోని జైభవాని కిరాణం షాపులో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు ఆ షాపుపై దాడి చేసి, తనిఖీ చేశారు. ఆ షాపులో 55 మద్యం బాటిళ్లు లభించగా వాటిని చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి సీజ్ చేశారు. షాపు యజమాని బర్ల నర్సింలుపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు కందుకూరు సీఐ మక్బూల్ జానీ తెలిపారు. మృతుడి తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలావున్నాయి. గుంత నాగర్ కర్నూల్ జిల్లా, తాడూరు మండలం, కోడూరు గ్రామానికి చెందిన తూంకుంట శంకర్(27) కొన్ని సంవత్సరాల క్రితం నగరంలోని సంతోష్‌నగర్‌లో స్థిరపడ్డాడు. ఈ నెల 20న తన భార్య దివ్యతో కలిసి సంతోషన్ నగర్ నుంచి తన సొంత గ్రామానికి స్కూటీపై వెళుతుండగా మండలంలోని దెబ్బడగూడ గేటు సమీపంలో వారి స్కూటీని ఓ కారు బలంగా ఢీ కొట్టింది. దీంతో శంకర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం బీఎన్‌రెడ్డి నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జేపీ దర్గాలో ఇఫ్తార్ విందు


ముస్లింలకు పండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి, వంశీచంద్‌రెడ్డి

కొత్తూర్, మార్చి 22 : మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో గల హజరత్ జహంగీర్‌పీర్ దర్గా వద్ద శుక్రవారం రాత్రి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మైనార్టీ నాయకుడు సయ్యద్‌సిరాజ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు ఇన్ముల్‌నర్వ గ్రామంలో మహిళా గ్రూపు సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి, వంశీచంద్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆరు గ్యారంటీలతో పాటు, మరిన్ని పథకాలను ప్రజలకు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఫరూఖ్‌నగర్ ఎంపీపీ ఖాజా ఇద్రీస్, నాయకులు హరినాథ్‌రెడ్డి, బాబర్‌ఖాన్, శివశంకర్‌గౌడ్, పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

షాద్‌నగర్ : పాత జాతీయ రహదారి విస్తరణ పనుల వల్ల ఎవరికీ ఆటంకాలు కలుగకుండా చూస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెప్పారు. షాద్‌నగర్ పట్టణ ప్రధాన కూడలి నుంచి సోలీపూర్ వరకు చేపట్టిన పాత జాతీయ రహదారి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే మాట్లాడారు. రోడ్డు విస్తరణ కోసం సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెప్పారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి


శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న చందన్‌వెల్లి భూనిర్వాసితులు

షాబాద్, మార్చి 22 : చందన్‌వెల్లి 190 సర్వేనెంబర్‌లో గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలను విచారించి తమకు న్యాయం చేయాలని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు నగరంలో ఆయన నివాసంలో కలిసిన ఆ భూ నిర్వాసితులు వినతి పత్రం అందజేశారు. తమకు న్యాయం చేయాలని గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు ధర్నాలు చేశామని, అయినా న్యాయం జరగలేదని వారు చెప్పారు. విచారణ చేసి రైతులకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. బేగరి జంగయ్య, మహేందర్, మల్లేష్‌గౌడ్, సత్తయ్య ఉన్నారు.

నాసిరకం టమాట నారుతో నష్టపోయిన రైతు


రంగు మారిన టమాటాలు

యాచారం, మార్చి 22 : నాసిరకం టమాట నారుతో మండలంలోని చౌదర్‌పల్లిలో ఓ రైతు రూ.మూడు లక్షలు నష్టపోయిన ఉదంతం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు చెప్పిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. చౌదర్‌పల్లికి చెందిన ఇరుపాక మహేందర్‌రెడ్డి తన రెండెకరాల భూమిలో టమాట పంట వేశాడు. మండల కేంద్రంలో కూరగాయల నారు విక్రయించే వ్యక్తి నుంచి ఒక్క మొక్కకు రూ.50పైసలు వెచ్చించి కొనుగోలు చేశాడు. పొలాన్ని మూడు సార్లు దుక్కి దున్ని మొక్కలు నాటాడు. పంటకు సేంద్రియ ఎరువులతో పాటు రసాయన మందులను, ఎరువులను ఉద్యానవనశాఖ అధికారుల సూచన మేరకు వేశాడు. కొంత మేర పూత వచ్చాక అది ఎర్రగా మారి నలిగి పోతున్నదని బాధిత రైతు ఇరుపాక మోహన్‌రెడ్డి వాపోయారు. కాగా ఇదే పొలాన్ని ఉద్యానవనశాఖ అధికారి కనకమహాలక్ష్మి పంటను పరిశీలించగా నాసిరకం విత్తనాల వల్ల ఆ రైతు నష్టపోయాడని ఆమె చెప్పారు. తనకు రూ.3లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. నాసిరకం నారు అమ్మిన విక్రేతను దీనిపై ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదని మోహన్‌రెడ్డి చెప్పారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సంక్షిప్తంగా..

కడ్తాల్, మార్చి 22 : యువత స్వశక్తితో ఎదిగి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జడ్పీటీసీ దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో నరేశ్‌నాయక్ అనే వ్యక్తి స్వయం ఉపాధిలో భాగంగా ఏర్పాటు చేసిన ఓ కార్ షో రూమ్‌ను స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు.

చేవెళ్ల : నలుభై ఏళ్ల క్రితం సాదాబైనామా పత్రాల ద్వారా తాము ఇంటి స్థలాలను కొనుగోలు చేశామని, అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇళ్ల స్థలాలను ఖాళీ చేయాలని కోర్టు ద్వారా తమకు నోటీసులు పంపిస్తున్నాడని మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన పలువురు ఇళ్ల యాజమానులు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మోహన్, సత్యనారాయణ, శ్రీకాంత్,రమేష్, అంజన్‌కుమార్, మల్లేష్, హరీష్ తదితరులున్నారు.

మహేశ్వరం : మానవతాదృక్పథంతో పేదలకు నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చులతో అందించేందుకు ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాకమంత్రి దామోదర రాజనర్సింహ్మా అన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన శుక్రవారం ప్రారంభించారు.

ఇబ్రహీంపట్నం : మండలంలోని నేదునూరు మత్స్య సహకార సంఘం అధ్యక్షునిగా పోలెమోని లక్ష్మణ్‌ముదిరాజ్ ఎన్నికైనట్లు ఆ సంఘం ఎన్నికల పరిశీలకుడు వెంకటేష్ శుక్రవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా పిట్టల రాములు, కార్యదర్శిగా పి. పాండుముదిరాజ్, డైరక్టర్లుగా పోలెమోని శ్రీశైలం, పి.యాదయ్య, పి.నరహరి, ఎ. లక్ష్మణ్, నల్లి జగన్, నీరటి వెంకటేష్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు.

ఆదిభట : ఆదిభట్ల మున్సిపాల్టీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామ మత్స్యశాఖ సొసైటీ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారని ఆ సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షురాలిగా ముక్కర విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా గోదాసు ప్రేమలత, ప్రధాన కార్యదర్శిగా కాకి సంతోషలను ఎన్నుకున్నట్లు ఆమె చెప్పారు.

ఆమనగల్లు : మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన జెల్ల బుడ్డయ్య అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబాన్ని శుక్రవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం, మాజీ సర్పంచ్ గోదాదేవి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఆమనగల్లు : శెట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి ఓ పేదింటి ఆడబిడ్డ పెళ్లికి సాయమందించి ఉదారం చాటుకున్నారు. గ్రామానికి చెందిన కొమ్ము విష్ణయ్య యాదమ్మ కూతురు సుష్మ వివాహానికి తులం బంగారం రూ.10,116 అందజేశారు.

తలకొండపల్లి : బీఆర్ఎస్ కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉంటామని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెల్జాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆనంద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శుక్రవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.